
సార్వజనిక్ గణేష్ కు 80 ఏళ్లు..



2



2

స్కూల్ భవనం కోసం రాస్తారోకో



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in





## శాంతిని ప్రోత్సహించేందుకు క్రీడలు అవసరం

**అక్షరటుడే, ఇందూరు:** సమాజంలో శాంతిని ప్రోత్సహించేందుకు క్రీడలు ఎంతో ప్రధానమని డీవైఎస్వో పవన్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా సైక్లింగ్ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సైక్లింగ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ కాంత్ మాట్లాడుతూ.. మేజర్ ధ్యాన్‌చంద్ హాకీతో దేశాన్ని మేల్కొల్పాడన్నారు. రవి హైస్కూల్ యాజమాన్యం సరళ మహేందర్ రెడ్డి తదితరులున్నారు.





## శ్రీరాంసాగర్‌కు పోటెత్తిన వరద..

### 39 గేట్ల ద్వారా 5 లక్షల క్యూసెక్కుల విడుదల

**అక్షరటుడే, ఆర్మూర్ :** శ్రీరాంసాగర్‌కు వరద పోటెత్తింది. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో కురిసిన వర్షాలతో ప్రాజెక్ట్‌లోకి భారీగా ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఎస్సారెస్పీ లోకి ప్రస్తుతం 4.30 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో అధికారులు 39 వరద గేట్లను ఎత్తి 5.04 లక్షల క్యూసెక్కులను గోదావరి లోకి విడుదల చేస్తున్నారు. ఎస్కేప్ గేట్ల ద్వారా 8 వేలు, వరద కాలువ కు 17,300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. వర్షాల నేపథ్యంలో ఆయకట్టుకు నీటి విడుదలను నిలిపివేశారు. కాకతీయ, సరస్వతి, లక్ష్మి కాలువలకు నీటిని వదలడం లేదు. మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 636 క్యూసెక్కుల నీరు పోతోంది. దీంతో మొత్తం 5,30,622 క్యూసెక్కుల ఔట్ ఫ్లో నమోదు అవుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 (80.5 టీఎంసీలు) అడుగులు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 1086.60 (65.135 టీఎంసీలు) అడుగుల నీరు ఉంది.



## జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్..

**అక్షరటుడే, కామారెడ్డి:** భారీ వర్షాలు కామారెడ్డిలో అల్లకల్లోలం సృష్టించాయి. చెరువులు, కుంటలు పొంగి పొర్లడంతో రోడ్లపైకి నీరు చేరి రహదారులు దెబ్బతిన్నాయి. తాజాగా కామారెడ్డి 44 జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. టేక్రియాల్ నుంచి కామారెడ్డి, భిక్కనూరు మండలం జంగంపల్లి వరకు ఒకవైపు భారీగా వాహనాలు నిలిచిపోయాయి. టేక్రియాల్ బైపాస్ వద్ద అడ్లూరు ఎల్లారెడ్డి చెరువు నీళ్లు రోడ్డుపై పారడంతో రోడ్డు దెబ్బతింది. దీంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఒకవైపు వాహనాలను పంపించి మరోవైపు వాహనాలను నిలిపివేస్తున్నారు. దీంతో వాహనాలు వెళ్లడానికి గంటల కొద్దీ సమయం పడుతోంది.



## పూర్తిగా ఖాళీ అయిన రామ్‌సాగర్ చెరువు

**అక్షరటుడే, ఇందల్వాయి:** భారీ వర్షాల వల్ల ఇందల్వాయి మండలంలోని రామ్ సాగర్ చెరువు కట్ట తెగిపోయింది. దీంతో చెరువు కింద పొలాలు కోతకు గురయ్యాయి. చెరువు కట్ట తెగడంతో భారీ వరద సిర్నాపల్లితో పాటు గౌరారం తదితర ప్రాంతాల పై ప్రభావం చూపింది. అలాగే జీకే తండా చెరువు కట్ట తెగడంతో తండాలోకి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరింది.



# ఎందుకీ విలయం

- కామారెడ్డిని ముంచెత్తిన వానలు
- భారీ వరదలకు కబ్జాలే కారణమని ఆరోపణలు
- ఎత్తులో ప్రదేశంలో ఉన్నా వరదలు
- చరిత్రలో ఎన్నడూ చూడని భారీనష్టం
- చెరువు, నాలాలపై ఇష్టారాజ్యంగా కబ్జాలు, నిర్మాణాలు
- అధికారులు, నాయకులు మొద్దునిద్ర వీడేనా..

**కుండపోత వర్షం కామారెడ్డి ప్రజలకు కన్నీళ్లు మిగిల్చింది. వరదలతో పట్టణం అల్లకల్లోలంగా మారింది. ముఖ్యంగా ఓ కాలనీ మొత్తం జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. వరదలతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. కామారెడ్డి ఎత్తయిన ప్రదేశంలో ఉంటుందని, ఇక్కడ వరదలు వచ్చే అవకాశం లేదని భావించిన ప్రజలకు భారీ వరదలు ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేశాయి. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇంతటి జలవిలయానికి కారణమేమిటనే సందేహాలు సామాన్యుల మెదళ్లను తొలుస్తున్నాయి.**

**- అక్షరటుడే, కామారెడ్డి**

కామారెడ్డిని చరిత్రలో చూడని విధంగా వరదలు ముంచెత్తాయి. దాదాపు ఒకటిన్నర రోజులు బాహ్య ప్రపంచంతో సంబంధాలు లేకుండా మారిపోయాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా జీఆర్ కాలనీలో ఇళ్లన్నీ నీట మునిగాయి. ఈ పరిస్థితికి కారణం కబ్జాలేనని తెలుస్తోంది. గతంలో అనేక సార్లు వాగులో నుంచి వరదలు వచ్చాయి. అయినా ఇంతటి దుస్థితి రాలేదు. కామారెడ్డి చెరువు పక్కనే వాగు ఉండడం, వాగును ఆనుకుని ఇళ్ల నిర్మాణం ఉండడంతోనే ఇంతటి విలయానికి కారణమని తెలుస్తోంది.

### ఇష్టానుసారంగా నిర్మాణాలు

హౌజింగ్ బోర్డు, జీఆర్ కాలనీలలో నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టినట్లు తెలుస్తోంది. నాలాలు, వాగు స్థలాలను కబ్జా చేసి వాటిని వెంచర్లుగా మార్చి అమాయకులను చూసి అంటగట్టినట్టుగా ప్రచారం సాగుతోంది. వాగులు, కాల్వల పక్కన ఇళ్ల నిర్మాణం చేపట్టవద్దని నిబంధనలున్నా వాటిని తుంగలో తొక్కారని తెలుస్తోంది. అయితే ఇవన్నీ తెలిసి నాడు అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### గతంలో జీపీ పరిధిలో కాలనీ

జీఆర్ కాలనీ గతంలో సరంపల్లి పంచాయతీ పరిధిలో ఉండేది. ఆ సమయంలోనే అక్కడ వెంచర్ ఏర్పాటైంది.



కొన్ని ప్లాట్ల విక్రయాలు జరపగా మరికొన్ని బిల్డింగులు కట్టి విక్రయించారు. అయితే 2004లో ఇటువంటి వరద లు ఆ కాలనీని చుట్టుముట్టాయి. కానీ మరీ ఇంతలా వరద లు రాలేదు. కేవలం డ్రెయినేజీలు పొంగిపొర్లాయి. అయితే చెరువును ఆనుకుని ఉన్న వాగు పెద్దగా ఉండేది. క్రమంగా ఆ వాగు కబ్జాకు గురైనట్టుగా కామారెడ్డి వాసులు చెబుతున్నారు. వాగు కబ్జాకు గురవడంతో పాటు వాగు అంచునే ఇళ్లను నిర్మించుకున్నారు. దాంతో వాగు ప్రవాహం పెరిగినప్పుడల్లా ఈ కాలనీ ప్రజలు భయం గుప్పిట జీవిస్తున్నారు.

### ఎత్తులో ఉన్న కామారెడ్డి

కామారెడ్డి పట్టణం ఉమ్మడి జిల్లాలో మిగతా నియోజకవర్గాల కంటే ఎత్తులో ఉంటుంది. ఈ ప్రాంతంలో నీటి వనరులు తక్కువ. బోర్లపైనే వ్యవసాయ దారులు ఆధారపడి సాగు చేస్తుంటారు. వర్షాల కోసం ఎదురు చూసే ఈ ప్రాంతం ఇప్పుడు వరదల్లో చిక్కుకోవడం గమనార్హం.

### పట్టణంలోనూ కబ్జాలు

కామారెడ్డి పట్టణానికి కాస్త దూరంగా ఉన్న హౌసింగ్ బోర్డు, జీఆర్ కాలనీలు మాత్రమే కాకుండా పట్టణం నడిబొడ్డున ఉన్న విద్యానగర్, అశోక్ నగర్, బతుకమ్మ కుంట లాంటి ప్రాంతాల్లో కూడా నాలాలు కబ్జాకు గురయ్యాయని తెలుస్తోంది. నాలాలపై ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టడంతో డ్రెయినేజీలు కూడా నిర్మించలేని పరిస్థితులు నెలకొన్నాయి. దాంతో పట్టణం మొత్తం వర్షాకాలంలో వరదలు ప్రవహిస్తుంటాయి.

### కబ్జాలపై ఫిర్యాదులు రాలేదు

జీఆర్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీలో వాగు, చెరువు ప్రాంతంతో పాటు నాలాలు కబ్జాకు గురయ్యాయని మా దృష్టికి రాలేదు. నాలాలపై నిర్మాణాల వల్లనే ఈ పరిస్థితి వచ్చిందని తెలుస్తోంది. ప్రస్తుతం వరదలో చిక్కుకున్న వారి పరిస్థితులు సాధారణ స్థితికి తెచ్చే పనిలో ఉన్నాం. కబ్జాలపై త్వరలోనే దృష్టి సారిస్తాం.

**– రాజేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్**




### మొద్దునిద్ర వీడతారా..?

కామారెడ్డి చరిత్రలో ఇంతలా వరదలు రాలేదు. అయితే ఇంతటి వరదలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా నాయకులు, అధికారులే కారణమన్న వాదన వినిపిస్తోంది. నాయకులు తమ స్వలాభం కోసం అడిగిన వారికి ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇప్పించారని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోకుండా అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నాయకులు చెప్పిన వారికి అనుమతులు ఇవ్వడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని తెలుస్తోంది. అయితే భవిష్యత్తులో ఇలాంటి విపత్తులు రాకుండా చూడాల్సిన బాధ్యత కూడా అధికారులు, నాయకులపై ఉంది. కాగా.. అధికారులు, నాయకులు మొద్దు నిద్ర వీడి ఇలాంటి పరిస్థితి రాకుండా చూడాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

## బీబీపేట చెరువు బుంగను త్వరగా పూడ్చండి

**అక్షరటుడే, కామారెడ్డి:** బీబీపేట పెద్ద చెరువును కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. చాలా ఏళ్ల తర్వాత చెరువు పూర్తిగా నిండడంతో పాటు నీటి ప్రవాహం ఎక్కువై చెరువుకు బుంగ పడింది. దాంతో చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని గ్రామస్థులు కలెక్టర్‌కు సమాచారం అందించారు. స్పందించిన కలెక్టర్ చెరువు బుంగను వెంటనే పూడ్చివేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గురువారం అర్ధరాత్రి బీబీపేట వెళ్లారు. చెరువు బుంగ పూడ్చే పనులను స్వయంగా పరిశీలించారు. బుంగ పూడ్చే పనుల్లో ఎస్డీఆర్ఎఫ్, రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాలు పంచుకున్నారు. చెరువుకు సంబంధించి లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని.. అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించాలని కలెక్టర్ సూచించారు.



## బ్యాక్‌వాటర్‌లో చిక్కుకున్న పశువుల కాపరిని కాపాడిన పోలీసులు

**అక్షరటుడే, బాల్కొండ :** శ్రీరాంసాగర్ బ్యాక్ వాట ర్‌లో చిక్కుకున్న ఓ పశువుల కాపరిని పోలీసులు అతికష్టంమీద కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీరాంసాగర్ జలాశయానికి వరద నీరు పోటెత్తుతుండడంతో గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. కాగా.. ఓ పశువుల కాపరి గేదెలను తీసుకొని శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ ప్రాంతంలోని ఎమ్మెల్యే గెస్ట్ హౌస్ ప్రాంతానికి పశువులను మేపడానికి తీసుకువెళ్లాడు. కాగా.. ఒక్కసారిగా ఆ ప్రాంతంలో వరద నీరు చుట్టుముట్టింది. దీం తో పశువల కాపరి ఆందోళనకు గురయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. సీఐ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పశువుల కాపరిని రక్షించారు. అనంతరం గేదెలను కూడా బయటకు తీసుకొచ్చారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



## దెబ్బతిన్న పంటల పరిశీలన

**అక్షరటుడే, బాన్సువాడ:** మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బీర్కూర్ లో పంటలు నీట మునిగాయి. దీంతో శుక్రవారం బాన్సువాడ ఏడీఏ అరుణ పరిశీలించారు. వరద ప్రభావంతో నీట మునిగిన వరి పంటల వివరాలు ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఆమె వెంట ఏఈవో మీనా, తదితరులున్నారు.




## కేసీఆర్, హరీష్‌రావులను దోషులుగా నిలబెడతాం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** కాళేశ్వరం నిర్మాణం జరిగిన అవినీతిని బయటపెట్టి ప్రజల ముందు కేసీఆర్, హరీష్‌రావును దోషులుగా నిలబెడతామని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో తాము చేసిన అవినీతి ఎక్కడ బయటపడుతుందో అనే భయంతో కేసీఆర్, హరీష్‌రావులు హైకోర్టుకు వెళ్లారన్నారు. కేసీఆర్, హరీష్‌రావు హైకోర్టును స్టే అడిగితే వారి పిటిషన్లను కోర్టు కొట్టివేసిందన్నారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పు వారికి చెంపపెట్టు అని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అతి పెద్ద అవినీతి అని.. సుమారు రూ. లక్ష కోట్లు ఖర్చు పెట్టిన ప్రాజెక్టు నిర్వీర్యం అయిందన్నారు. వందేళ్లు ఉండాల్సిన ప్రాజెక్టు మూడేళ్లకే కూలినా తాము తప్పు చేయలేదని బీఆర్ఎస్ నేతలు చెప్పడం సిగ్గు చేటన్నారు.

రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు నిజామాబాద్‌లోని ధర్పల్లి, సిరికొండ మండలాలను ముంచెత్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలను వరద ముంచెత్తిందని, ప్రాణనష్టం జరగకున్నా ఆస్తినష్టం జరిగిందని చెప్పారు. వరదల వల్ల జరిగిన నష్టం విషయమై నివేదికలు తెప్పిస్తున్నామని, అన్ని విధాలా వరద బాధితులను ఆదుకుంటామన్నారు. సమావేశంలో డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ సాయ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## వరద ప్రాంతాల్లో సహాయక చర్యలను పరిశీలించిన కలెక్టర్

**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంతో పాటు పలు వరద బాధిత గ్రామాల్లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం పర్యటించారు. వరద అనంతరం ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించారు. వరద ముంపునకు గురైన జిల్లా కేంద్రంలోని జీఆర్ కాలనీలో పర్యటించి ప్రజల సాధారణ జీవనానికి ఇబ్బంది కలుగకుండా చేపట్టిన విద్యుత్ , డ్రెయినేజీ, తాగునీటి సరఫరా, రహదారుల పునరుద్ధరణ తదితర పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కామారెడ్డి పట్టణ పరిధిలోని పెద్ద చెరువును సందర్శించి వాటర్ ఫిల్టర్‌ను పరిశీలించారు. పట్టణ ప్రజలకు ఇబ్బంది కలగకుండా శుద్ధి చేసిన తాగునీటిని నిరంతరాయంగా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దెబ్బతిన్న రహదారులు, విద్యుత్ సరఫరా యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించడం జరుగుతుందని తెలిపారు.





## ముంపు గ్రామాలను సందర్శించిన కలెక్టర్

**అక్షరటుడే, బోధన్ :** భారీ వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద వస్తోంది. దీంతో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతం సమీపంలోని హంగర్గ గ్రామంలోకి వరద నీరు వచ్చింది. వరద ముంచెత్తడంతో గ్రామంలో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వరద నీరు రావడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ఇప్పటికే హంగర్గ గ్రామానికి చేరుకున్నాయి. అక్కడి పరిస్థితిని అంచనా వేస్తున్నాయి. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి గ్రామాన్ని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఆయన పరిశీలించారు. అదేవిధంగా సాలురా మండలం హున్సా, మందర్న గ్రామాల్లో వరద నీరు చేరుకోవడంతో ఆ గ్రామాల ప్రజలను సాలూరలోని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఈ గ్రామాలను కూడా కలెక్టర్ సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఆయా గ్రామాలలో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బందిని అప్రమత్తం చేశారు.

## నిజాయితీ చాటుకున్న ట్రాఫిక్ హోంగార్డ్




**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరంలోని ఓ వ్యక్తి రోడ్డుపై సెల్‌ఫోన్ పోగొట్టుకోగా ట్రాఫిక్ హోంగార్డు గుర్తించి తిరిగి అతడికి అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని కోటగల్లిక చెందిన రాజేశ్వర్ ఎప్పటిలాగే తన ఫైనాన్స్ విధుల్లో భాగంగా బైక్‌పై వెళ్తుండగా ఖలీల్‌వాడిలో తన ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ హోంగార్డు ఫోన్ పడిపోయినట్లు గుర్తించి సెల్‌ఫోన్ యజమాని రాజేశ్వర్‌కు ఫోన్‌చేసి పిలిపించారు. అనంతరం అతడికి ఫోన్‌ను అందజేశారు. సుమారు రూ.18వేల ఫోన్‌ను తిరిగి యజమానికి ఇచ్చిన ట్రాఫిక్ హోంగార్డు గంగామోహన్‌ను ట్రాఫిక్ ఏసీపీ గంగామోహన్, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్‌అలీ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అభినందించారు.

## వర్షా నికి కూలిన ఇళ్ల వివరాల సేకరణ



**అక్షరటుడే, నిజాంసాగర్:** మండల కేంద్రంలో పంచాయతీ అధికారులు శుక్రవారం పలు కాలనీల్లో పర్యటించి కూలిపోయిన ఇళ్ల వివరాలను సేకరిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి భీంరావు వివరాలను సేకరిస్తూ ఇళ్ల ఫొటోలను సేకరిస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సైతం పంచాయతీ కార్యదర్శులు కూలిపోయిన ఇళ్ల వివరాలను సేకరిస్తూ పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శుల వెంట కారోబార్ సాయిలు తదితరులున్నారు.

## నిజాంసాగర్‌కు తగ్గిన వరద ఉధృతి..

### విద్యార్థులను తరలించిన అధికారులు



**అక్షరటుడే, నిజాంసాగర్ :** ఉమ్మడి మెదక్, కామారెడ్డి జిల్లాల్లో మంగళవారం రాత్రి నుంచి కుండపోత వానతో నిజాంసాగర్ ప్రాజెక్ట్‌కు భారీగా వరద వచ్చిన విషయం తెలిసిందే. అయితే గురువారం నుంచి వరుణుడు కాస్త శాంతించాడు. దీంతో ప్రాజెక్ట్‌లోకి వరద తగ్గుముఖం పట్టింది. ఎగువ నుంచి వరద తగ్గడంతో అధికారులు దిగువకు నీటి విడుదలను తగ్గించారు. 12 వరద గేట్ల ద్వారా కొంతమేర నీటి విడుదలను తగ్గించడంతో దిగువన వరద ఉధృతి తగ్గింది. దీంతో శుక్రవారం ఉదయం చిన్నాపూల్ వంతెన తేలింది. వంతెన మునిగిపోవడంతో అటువైపు గల ఆదర్శ పాఠశాలలో విద్యార్థినులు అనేక ఇబ్బందులు పడ్డారు. వరద ఉధృతి తగ్గడంతో మోడల్ పాఠశాల బాలికల వసతి వసతి గృహాన్ని శుక్రవారం ఉదయం ఖాళీ చేయించారు. విద్యార్థులను కస్తూర్బా గాంధీ వసతి గృహానికి తరలించారు. ఎస్సై శివకుమార్, పిట్లం మార్కెట్ కమిటీ ఛైర్మన్ మనోజ్ కుమార్, నిజాంసాగర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లికార్జున్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ కార్తీక సంధ్య వార్డెన్ సరోజన విద్యార్థును ఇళ్లకు పంపించారు.


## పోచారం ప్రాజెక్టుపై కొనసాగుతున్న మరమ్మతులు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి/లింగంపేట :** భారీ వర్షాలతో పోచారం ప్రాజెక్ట్‌కు బుధవారం వరద పోటెత్తిన విషయం తెలిసిందే. దీంతో ప్రాజెక్టు ఓవర్ హెడ్ వద్ద మట్టి కొట్టుకుపోయింది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో కాస్త తగ్గడంతో మరమ్మతులు చేపట్టారు. వరద ధాటికి డ్యామ్ అప్రోచ్ వాల్ కొట్టుకుపోగా.. ఇసుక బస్తాలు, మట్టితో దానికి మరమ్మతులు చేపట్టారు.

## ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో ఘనంగా స్పోర్ట్స్ డే

అక్షరటుడే, ఆర్మూర్ : పట్టణ శివారులోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో శుక్రవారం స్పోర్ట్స్ డే ఘనంగా నిర్వహించారు. పాఠశాల పరిపాలన అధికారి పద్మ మాట్లాడుతూ.. భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జన్మదినం పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటారని, ఒలి ంపిక్ గేమ్స్‌లో మూడు బంగారు పతకాలు సాధించారని గుర్తు చేశారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణించాలని, క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం పొందవచ్చన్నారు. విద్యార్థుల్లో ఆత్మన్యూనత భావం తొలగి, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




మన దేశంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు ఒక ప్రత్యేకత ఉంది. రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని, తెల్ల దొరలను దేశం నుంచి తరిమికొట్టేందుకు బాల గంగాధర్ తిలక్ దేశ ప్రజలను సంఘటితం చేయాలనే ఉద్దేశంతో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. ఇలా మొదలైన ఉత్సవాలను నేడు దేశమంతా ఘనంగా నిర్వహించుకున్నారు. మన జిల్లాలోనూ ఏటా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుపుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని సార్వజనిక్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో 80 ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

- అక్షరటుడే, ఇందూరు




# సార్వజనిక్ గణేశ్ మండలికి 80 ఏళ్లు..

- ఇందూరులో 1942లో ప్రారంభం
- బాలగంగాధర్ తిలక్ స్ఫూర్తితో ఏర్పాటు
- రథయాత్ర ప్రత్యేకం

జిల్లా కేంద్రంలోని రైల్వే గేట్ (లలితామహల్ సమీపంలో) వద్ద గణపతి ఆలయంలో ఏటా సార్వజనిక్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. బాలగంగాధర్ తిలక్ పిలుపు మేరకు 1942లో జిల్లాలో చవితి ఉత్సవాలను ప్రారంభించారు. మొదట్లో గంజ్ వద్ద గల గోశాలలో మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించారు. అప్పట్లో 8 మంది కమిటీగా ఏర్పడి అధ్యక్షుడిగా గంజుల పోశెట్టి, ప్రధాన కార్యదర్శిగా కాశీనాథ్ రావు వ్యవహరిస్తూ స్వాతంత్ర ఉద్యమంలో భాగంగా గణపతి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం 1984లో వినాయకుని ఆలయం నిర్మాణం కావడంతో అక్కడే సార్వజనిక్ గణేశ్ మండలిని ఏర్పాటు చేశారు. మొదట్లో కమిటీగా ఏర్పడిన వారి కుమారులే ప్రస్తుతం ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం సార్వజనిక్ గణేశ్ మండలికి అధ్యక్షుడిగా బంటు గణేష్, ప్రధాన కార్యదర్శిగా శివకుమార్ పవార్ ఉన్నారు.

### ప్రతియేటా రథయాత్ర

ఇందూరులో వినాయకుల నిమజ్జనం అంటే రథయాత్రకు ఎంతో ప్రత్యేకత ఉంటుంది. భాగ్యనగర్ తర్వాత అత్యంత వైభవంగా ఇందూరులో నిర్వహిస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా రథాన్ని రూపొందించారు. ఇటీవల ఫర్టిలైజర్స్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన రథాన్ని అందజేశారు. అయితే నిమజ్జన శోభాయాత్ర గతంలో 21 జతల ఎడ్లతో రథాన్ని లాగేవారు. ప్రస్తుతం 11 జతల ఎడ్లు ఉంటున్నాయి. నగరంలోని దుబ్బ చౌరస్తాలోని బాలగంగాధర్ తిలక్ విగ్రహం వద్ద నుంచి రథయాత్ర ప్రారంభమై లలితా మహల్ థియేటర్, గంజ్, గాంధీ చౌక్, నెహ్రూ పార్క్, పవన్ థియేటర్, గాజుల్‌పేట, పెద్ద బజార్, గోల్ హనుమాన్ మీదుగా వినాయకుల బావి వరకు సాగుతుంది.



### ఎనిమిది దశాబ్దాలుగా..

80 ఏళ్లుగా ఇందూరులో గణేశ్ ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. మొదట్లో మా పెద్దలు ఉత్సవ నిర్వహణ ఏర్పాట్లు చూసుకునేవారు. గతంలో రథం వెళ్లాక మిగతా విగ్రహాలు వెనకాల వచ్చేవి. కానీ ప్రస్తుతం భారీ వినాయకులు తీసుకురావడంతో ఎక్కడి వారు అక్కడే నిమజ్జనానికి తరలి వెళ్తున్నారు. అలాకాకుండా రథం వెనకాల వచ్చి ఐక్యతను చాటాలి.

– **బంటు గణేశ్, సార్వజని గణేశ్ మండలి అధ్యక్షుడు**

## గంగమ్మ ఆలయం చుట్టూ వరద నీరు



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద ఉధృతి అంతకంతకూ పెరుగుతోంది. ఈ మేరకు దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. అయితే వరధ ఉధృతి కారణంగా దిగువ ప్రాంతంలోని గంగమ్మ ఆలయం నీటమునిగింది. మరింత ఉధృతి కొనసాగితే సమీపంలోనే ఉన్న రామాలయం సైతం మునిగిపోయే అవకాశాలున్నాయని స్థానికులు పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం గంగమ్మ ఆలయానికి భక్తులు తరలివస్తుంటారు.

– అక్షరటుడే, బాల్కొండ



## వరద బాధితులను ఆదుకుంటాం..

**అక్షరటుడే, బాన్సువాడ:** చందూర్ మండల కేంద్రంలోని వరద ప్రభావిత ప్రాంతాలను డీసీసీబీ మాజీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. అధికారులతో కలిసి శుక్రవారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన బాధిత కుటుంబాలను పరామర్శించి.. పార్టీ తరఫున అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. వరద కారణంగా ఇళ్లలో తడిసిన గృహోపకరణాలు, ఆహార పదార్థాలను పరిశీలించారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడూ కాంగ్రెస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. నష్టపోయిన ప్రతి కుటుంబానికి అవసరమైన సాయం అందేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## ఫెన్సింగ్ పోటీల్లో విద్యార్థికి రజత పతకం



**అక్షరటుడే, భీమ్‌గల్:** బాల్కొండ మండలంలోని కిసాన్ నగర్ సెయింట్ ఎలిజబెత్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని శివాని రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో రజత పతకం సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం సుందరి తెలిపారు. ఈ నెల 28న హైదరాబాద్‌లోని మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ హాస్పిటల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రజత పతకాన్ని సొంతం చేసుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా శుక్రవారం విద్యార్థినిని ఉపాధ్యాయ బృందం, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీకాంత్, కవిత అభినందించారు.

## కెనాల్‌లో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నగరంలోని నిజాంసాగర్ కెనాల్‌లో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆరో టౌన్ ఎస్‌హెచ్‌వో వెంకట్రావు తెలిపిన వివరాల ప్రకారం.. నగర శివారులోని డెయిరీ ఫాం కమాన్ వద్ద ఉన్న నిజాంసాగర్ కెనాల్‌లో శుక్రవారం ఉదయం మృతదేహాన్ని గుర్తించారు. కాలువలో పడి మృతి చెందిన వ్యక్తి మగవ్యక్తిగా గుర్తించామని ఎస్‌హెచ్‌వో తెలిపారు. సుమారు 40 ఏళ్లు ఉంటాయని.. ఆనవాళ్లు లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరికైనా మృతుడి సమాచారం తెలిస్తే ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ లో సంప్రదించాలని వారు కోరారు.

## తెగిన విద్యుత్ తీగలు.. పట్టించుకోని విద్యుత్‌శాఖ



మూడురోజులుగా కురుస్తున్న వర్షా లకు నగరంలోని శివారు ప్రాంతాలు వరద నీటితో నిండిపోయాయి. చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షం కారణంగా కాలనీల్లో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నగరంలోని పూలాంగ్ ప్రాంతంలో కరెంటు తీగలు తెగిపోయి రోడ్లపై పడ్డాయి. అయినా విద్యుత్ అధికారులు ఎవరూ స్పందించలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిన్నటి నుంచి విద్యుత్ లేక అవస్థలు పడుతున్నామని వాపోయారు. అధికారులు స్పందించి విద్యుత్ పునరుద్ధరించాలని కోరారు.

– అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్

## దుప్పట్ల పంపిణీ



**అక్షరటుడే, నిజాంసాగర్:** భారీవర్షాల కారణంగా నిజాంసాగర్ నుంచి దిగువకు వరద నీటిని వదులుతున్నారు. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రాజెక్టు ముంపు గ్రామం లింగంపల్లి వాసులను మూడు రోజుల నుంచి నిజాంసాగర్ మండలంలోని గోర్గల్ గేటు వద్ద ఫంక్షన్ హాల్‌లో ఆశ్రయం కల్పించారు. ఈ సందర్భంగా శుక్రవారం జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజలకు దుప్పట్లు అందజేశారు. వాటిని బీజేపీ నాయకులు జగదీష్, నిజాంసాగర్ మండల బీజేపీ అధ్యక్షుడు మేకల నరేష్ ఆధ్వర్యంలో వరద బాధితులకు అందజేశారు.



## వరద బాధితులకు పరామర్శ

**అక్షరటుడే, డోంగ్లి :** వరద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించగా.. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పరామర్శించారు. డోంగ్లి ప్రభుత్వ పాఠశాలలోని పునరావాస కేంద్రంలో శుక్రవారం బాధితులతో మాట్లాడారు. ఏర్పాట్లు, సౌకర్యాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అలాగే దుస్తులు, చీరలు తెప్పించి బాధితులకు అందజేశారు. ఎవరికి ఏ సమస్య ఉన్నా వెంటనే తనకు సమాచారమివ్వాలని సూచించారు. ప్రజల కోసమే తానున్నానని భరోసా ఇచ్చారు. అనంతరం బాధితులకు స్వయంగా భోజనాలు వడ్డించారు.



## వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

**అక్షరటుడే, బాన్సువాడ:** నస్రుల్లాబాద్ మండలం నెమ్లి గ్రామంలోని పునరావాస కేంద్రంలో బాధితులను శుక్రవారం బీజేపీ నాయకుడు సున్నం సాయిలు పరామర్శించారు. బాధితులకు అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. బీజేపీ నాయకులు అనుసూరి శ్రీనివాస్, అరిగె నారాయణ, పెరిక రాములు, కంది పెద్ద మల్లేష్, ఉల్లెంగ గోపి, ఉల్లెంగ పర్వయ్య, జగ్బీర్ సింగ్, మహేష్ పాల్గొన్నారు.